ప్రభుత్వం మాటలు.. నీటి మూటలు

హెచ్ఎండీపీ ఖాళీల భర్తీపై ఆగిన కసరత్తు

- గతంలో అన్ని విభాగాల ఖాళీలపై వివరాలు సేకరణ
- కొన్ని నెలలుగా కాగితాలకే నివేదిక పరిమితం
- పదే పదే అభివృద్ధి చేస్తామన్న సీఎం.. సొంత శాఖ నిర్లక్ష్యం
- చర్చనీయాంశంగా సిబ్బంది కొరత

సిటీబ్యూరో, నవంబర్ 4(నమస్తే తెలంగాణ): విశ్వనగర అభివృద్ధిలో కీలక పాత్రను పోషించే హెచ్ఎండీఏలో అరకొర సిబ్బందితో నెట్టుకొస్తోంది. ఏడు జిల్లాల పరిధిలో విస్తరించిన శాఖను బలోపేతం చేస్తామంటూ కాంగ్రెస్ చెప్పిన మాటలన్నీ నీట మూటలుగానే మారుతున్నాయి. అధికారంలోకి వచ్చిన వెంటనే సిబ్బంది ఖాళీలపై హెచ్ఎండీఏను బలోపేతం చేసే దిశగా నివేదికలు తెప్పించుకున్న ప్రభుత్వం, ఆ తర్వాత ఆ విషయాన్నే పక్కన పెట్టింది. హైదరాబాద్ పరిధిని విస్తరిస్తూ, అంతర్జాతీయ స్థాయిలో అభివృద్ధి చేస్తామంటూ పదేపదే వ్యాఖ్యానించే సీఎం రేవంత్ రెడ్డి సొంత శాఖను నిర్లక్ష్యం చేస్తున్నారు. దీంతో సంస్థ బలోపేతానికి అవసరమైన మానవ వనరుల కొరత ఇప్పుడు ఆ సంస్థను వేధిస్తున్నాయి. కొన్నేండ్లుగా ఉద్యోగాల భర్తీ లేకపోవడంతో, డిప్యూటేషన్ ఉద్యోగులతో నెట్టుకొస్తుంది. హెచ్ఎండీఏలో శాశ్వత ప్రాతిపదికన భర్తీ చేస్తే గానీ బలోపేతం సాధ్యం కాదని పలువురు ఉద్యోగులు చెబుతున్నారు.

సిబ్బంది కొరతలో హెచ్ఎండీఏ..

భారీ లే అవుట్లు, ఎకరాల్లో ల్యాండ్ పూలింగ్ ప్రాజెక్టులు, సిటీ నలువైపులా కొత్త కొత్త టౌన్‌షిప్‌లకు అనుమతులు ఇవ్వడంలో కీలక పాత్ర పోషించే హెచ్ఎండీఏ.., సిబ్బంది కొరతతో కొట్టుమిట్టాడుతూంది. నగరానికి మణిహారంగా ఉన్న ఓఆర్ఆర్ నిర్వహణ, అవుటర్‌కు సమీపంలో లంగ్ స్పేస్‌ను పెంచడంలో కీలకమైన అర్బన్ ఫారెస్ట్ పార్కుల నిర్మాణంతో మౌలిక వసతుల ప్రాజెక్టుల నిర్మాణం వంటి వ్యవహారాలన్నీ హెచ్ఎండీఏ నిర్వహిస్తోంది. ఇందులో ప్లానింగ్, ఇంజనీరింగ్‌తో అర్బన్ ఫారెస్ట్రీ వంటి ప్రధాన విభాగాలు ఉండగా.., హెచ్ఎండీఏ ఇప్పటివరకు ఎన్నో ప్రతిష్టాత్మకమైన ప్రాజెక్టులు, నిర్మాణ అనుమతులను జారీ చేసింది. ఓ వైపు నిర్మాణ అనుమతులకు ఆన్‌లైన్ సేవలు అందుబాటులోకి వచ్చినా.., నిర్మాణ అనుమతులను పర్యవేక్షించడానికి ప్లానింగ్ విభాగంలో సిబ్బంది కరువయ్యారు. ఇక కీలకమైన ప్రాజెక్టులను చేపట్టే ఇంజనీరింగ్ విభాగం కూడా చాలీచాలని సిబ్బందితో నెట్టుకొస్తుంది. ఎక్కడా ఏ ప్రాజెక్టును చేపట్టాలి? ఎప్పుడూ వాటిని పూర్తి చేయాలనే విషయాలను పర్యవేక్షించేందుకు సిబ్బంది కరువైంది. ఈ క్రమంలో కాంగ్రెస్ ప్రభుత్వం హెచ్ఎండీఏ పరిధిని ట్రిపుల్ ఆర్ వరకు విస్తరించాలనే ప్రతిపాదనలను తెర మీదకు తీసుకువస్తున్న తరుణంలో, సిబ్బంది కొరత ఇప్పుడు ఆ విభాగంలో చర్చనీయాంశంగా మారింది. 18 ఏళ్ల కిందట హెచ్ఎండీఏకు 600 పోస్టులు మంజూరైతే.., ఇప్పటివరకు ఉద్యోగుల సంఖ్య 15 శాతానికి దాటలేదు. ఇక ఉద్యోగులందరినీ డిప్యూటేషన్, అవుట్ సోర్సింగ్ విధానంలో నింపుకొంటూ పోతున్నారు.

రెగ్యులర్ సిబ్బంది భర్తీ ఎప్పుడు..?

తాము అధికారంలోకి వస్తే లక్షల ఉద్యోగాలను భర్తీ చేస్తామంటూ.. చెప్పిన కాంగ్రెస్ అధినేత రేవంత్ రెడ్డి, అందుకు అనుగుణంగా నివేదికను తీసుకువచ్చారు. పెండింగ్‌లో ఉన్న ఉద్యోగాల భర్తీకి చర్యలు తీసుకుంటామని ఉద్యోగ సంఘాల నేతలకు స్పష్టం చేశారు. కానీ, ఇప్పటికీ ఆ దిశగా ఒక్క అడుగు ముందుకు పడలేదు. ప్రధానంగా ప్రభుత్వానికి రెవెన్యూ తీసుకు వచ్చే కీలకమైన ప్లానింగ్ విభాగాన్ని పట్టించుకోవడం లేదు. అరకొర సిబ్బందితో నెట్టుకొస్తుండగా, పూర్తి స్థాయి సిబ్బందిని నియమించాలని ఉద్యోగ సంఘాలే ప్రభుత్వానికి లేఖ కూడా రాశాయి. జూనియర్ ప్లానింగ్ ఆఫీసర్ల కొరత తీవ్రంగా ఉందని, 44 మంది ఉండాల్సిన విభాగంలో కేవలం ఒక్కరే ఉన్నారని, మిగిలిన వారంతా అవుట్ సోర్సింగ్, డిప్యూటేషన్‌పై వచ్చినవారే. ఏఈఈ, జూనియర్ అసిస్టెంట్లు, అర్కిటెక్చరల్ డ్రాఫ్ట్స్‌మెన్, టైపిస్టులు ఇలా 200కు పైగా ఉద్యోగుల భర్తీ తక్షణమే చేయాలని కోరగా, అదే సమయంలో ఉద్యోగుల భర్తీ చేయకపోవడంతో అన్ని రిటైర్డ్ అయ్యేవారితో విభాగాలన్నీ ఖాళీ అవుతున్నాయని హెచ్ఎండీఏ వర్గాలు పేర్కొన్నాయి. అందుకు అనుగుణంగా రూపొందించిన నివేదికను పక్కనపెట్టింది. గడిచిన తొమ్మిది నెలలుగా ఈ అంశంపై ఒక్కసారి కూడా సమీక్షించలేదని హెచ్ఎండీఏ ఉద్యోగ సంఘాల నేతలు వాపోతున్నారు. చాలా కాలంగా ఉద్యోగాల భర్తీ ప్రక్రియ లేకపోవడంతో తమకు రావాల్సిన ప్రమోషన్లలో అన్యాయం జరుగుతుందని, ఉన్నత స్థాయి క్యాడర్లలో ఉండే ఉద్యోగాలకు డీటీసీపీ, ఇతర ఇతర ఇంజనీరింగ్ శాఖల నుంచి ఉద్యోగులు రావడంతో, మాతృ సంస్థలో నియమితులైన ఉద్యోగులు పదోన్నతి అవకాశాలను కోల్పోతున్నారని చెబుతున్నారు. ఈ క్రమంలో హెచ్ఎండీఏ పరిధిని పెంచాలని భావిస్తున్న ప్రభుత్వం తొలుత పూర్తి స్థాయి సిబ్బంది నియామకాలపై దృష్టి పెట్టాలని కోరుతున్నారు. సరిపోయేంత సిబ్బంది ఉన్నప్పుడే హెచ్ఎండీఏ పాలనా వ్యవహారాలు మెరుగుపడతాయని, లేదంటే ఆదాయ వనరులను కోల్పోయే అవకాశం ఉంటుందని హెచ్ఎండీఏ వర్గాలు పేర్కొన్నాయి. నిజానికి డిపార్ట్‌మెంట్ పాలన వ్యవహారాలను చక్కబెట్టడంలో సమృద్ధిగా ఉండే సిబ్బందితోనే సాధ్యం. అయితే, ఇన్నాళ్లుగా డిప్యూటేషన్ విధానంలో నెట్టుకొచ్చినా, పరిధి పెంచిన తర్వాత కూడా అదే సిబ్బందితో కార్యాకలాపాలు నిర్వహిస్తామంటే తమపై తీవ్రమైన పని ఒత్తిడి పెరుగుతుందని కొందరు ఉద్యోగులు వాపోతున్నారు. ప్రధానంగా ప్రభుత్వ ఖజానా నింపడంలో కీలకమైన ప్లానింగ్ విభాగాన్ని బలోపేతం చేయాల్సిన అవసరం ఉంది. ఇప్పటివరకు మాతృ సంస్థ ఉద్యోగులను కాదని, డిప్యూటేషన్‌పై వచ్చిన అధికారులే వ్యవహారాలు చక్కబెట్టుకొస్తున్నారు. ఈ క్రమంలో బిల్డింగ్, లే అవుట్ అనుమతుల విషయంలో కీలకమైన ఈ విభాగాన్ని పూర్తి స్థాయిలో మాతృ సంస్థ ఉద్యోగులను తీసుకు రావడం వలన... పాలన వ్యవహారాల్లోనూ పారదర్శకత పెరుగుతుంది. కానీ, ప్రభుత్వం అవేవీ పట్టనట్లుగా కేవలం పరిధి పెంచి ఉన్న సిబ్బందితోనే నెట్టుకొస్తూ రెవెన్యూ పెంచుకునేందుకు దృష్టి సారించినట్లుగా తెలుస్తోంది. సిబ్బంది కొరత కారణంగా పని ఒత్తిడి పెరుగుతుందే తప్ప, సమర్థవంతంగా పనిచేసే సిబ్బంది లేరని హెచ్ఎండీఏ వర్గాలు చెబుతున్నాయి.

ప్రజావాణి దరఖాస్తులను సత్వరమే పరిష్కరించండి

కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి

సిటీబ్యూరో, నవంబర్ 4(నమస్తే తెలంగాణ): సీఎం ప్రజావాణి దరఖాస్తులు పెండింగ్‌లో లేకుండా సత్వరమే పరిష్కరించాలని కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్‌లో సోమవారం జరిగిన ప్రజావాణి కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ, ప్రజా సమస్యల సత్వర పరిష్కారం కోసం ప్రజావాణి కార్యక్రమం నిర్వహిస్తున్నట్టు ఆ దిశగా జిల్లా అధికారులు వచ్చిన ఆర్జీలను వెంటనే పరిశీలించాలని సూచించారు. ప్రజావాణి కార్యక్రమంలో 255 దరఖాస్తులు వచ్చాయని, ఇందులో 208 గృహ నిర్మాణ శాఖకు సంబంధించినవని తెలిపారు. కార్యక్రమంలో డీఆర్ఓ వెంకటాచారి, ఆర్డీఓ రామకృష్ణ, జిల్లా అధికారులు ఆశన్న, పవన్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

వయోవృద్ధుల సమస్యల పరిష్కారానికి వెబ్ పోర్టల్

సిటీబ్యూరో, నవంబర్ 4(నమస్తే తెలంగాణ): సీనియర్ సిటిజన్స్ తమ మెయింటెనెన్స్ సమస్యలను వెబ్ పోర్టల్‌లో దరఖాస్తు చేసుకోవచ్చని కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి పేర్కొన్నారు. వయోవృద్ధులు తమ ఆస్తి, మెయింటెనెన్స్‌కు సంబంధించిన సమస్యలను tgseniorcitizens.cgg.gov.in లో దరఖాస్తు చేసుకుంటే పరిష్కార మార్గాలు చూపెడుతామని తెలిపారు.

అవగాహన ఒప్పందాలు రద్దు

వ్యవసాయ వర్సిటీ వీసీ అల్దాస్ జానయ్య

వ్యవసాయ యూనివర్సిటీ, నవంబర్ 4: గతంలో ప్రయివేటు సంస్థలతో చేసుకున్న ఒప్పందాలను రద్దు చేస్తున్నట్లు ప్రొ.జయశంకర్ తెలంగాణ రాష్ట్ర వ్యవసాయ యూనివర్సిటీ ఉప కులపతి డాక్టర్ అల్దాస్ జానయ్య తెలిపారు. 2022 జూలై వరకు వ్యవసాయ విశ్వవిద్యాలయంతో కొన్ని ప్రయివేటు సంస్థలు చేసుకున్న ఒప్పందాలను రద్దు చేస్తున్నట్లు తెలిపారు. విశ్వవిద్యాలయం ప్రయోజనాలకు భంగం కల్గించేలా ఉన్నందున ప్రైవేటు (సీడు కంపెనీలు, ఎడ్యుకేషన్ సెంటర్లు, టెక్నికల్) వాటిని పునర్ పరిశీలించి వాటి వివరాలు ప్రకటించే వరకు ఆయా ప్రైవేటు సంస్థల ప్రతినిధుల మాటలను నమ్మి మోసపోవొద్దని, విద్యార్థుల తల్లిదండ్రులకు సూచించారు. మరిన్ని వివరాలకు వర్సిటీ వెబ్ సైట్‌ను సంప్రదించాలని సూచించారు.

తెలుగు వర్సిటీ కోర్సులలో స్పాట్ అడ్మిషన్లు

తెలుగు యూనివర్సిటీ, నవంబర్ 4: పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం 2024-25వ విద్యా సంవత్సరానికి వివిధ కోర్సులలో ప్రవేశానికి కొన్ని సీట్లు మిగిలి ఉన్నందున బాచుపల్లి ప్రాంగణంలో నవంబర్ 6న ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం 3గంటల వరకు స్పాట్ అడ్మిషన్లు చేపట్టినట్లు సెంట్రల్ అడ్మిషన్ కమిటీ డైరెక్టర్ డాక్టర్ బి.రాధ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆసక్తి కలిగిన ఎస్సీ, ఎస్టీ, బీసీ, స్పోర్ట్స్, పీహెచ్‌సీ అభ్యర్థులు కులం, ఆధాయ ధ్రువీకరణ పత్రాలతో నేరుగా అడ్మిషన్స్ పొందవచ్చన్నారు. ఎం.ఏ అనువర్తిత భాషా శాస్త్రం, బీ.ఎఫ్.ఏ, ఎం.ఎఫ్.ఏ, ఎం.ఏ కర్ణాటక సంగీతం, ఎం.పి.ఏ నృత్యం, ఎం.పి.ఏ జానపద కళలు, ఎం.పి.ఏ రంగస్థల కళలు, పీజీ డిప్లమా ఇన్ జ్యోతిర్వాస్తు, డిప్లమా ఇన్ జ్యోతిషం, సర్టిఫికేట్ ఇన్ జ్యోతిషం, పీజీ డిప్లమా ఇన్ యోగా, పీజీ డిప్లమా ఇన్ డిక్షనరీ మేకింగ్, పీజీ డిప్లమా ఇన్ తెలుగు లాంగ్వేజ్ టీచింగ్, డిప్లమా ఇన్ లలిత సంగీతం, పీజీ డిప్లమా-ఫిలిం డైరక్షన్, డిప్లమా - పద్య నాటకం, డిప్లమా-మిమిక్రీ, డిప్లమా ఇన్ ఇంద్రజాలం, బ్యాచిలర్ ఆఫ్ డిజైన్ ఇన్ విజువల్ కమ్యూనికేషన్, బ్యాచిలర్ ఆఫ్ డిజైన్ ఇన్ ఇంటీరియర్ డిజైన్, సర్టిఫికేట్ ఇన్ యానిమేషన్ వీఎఫ్ఎక్స్, సర్టిఫికెట్ ఇన్ ఫొటోగ్రఫీ, వీడియోగ్రఫీ కోర్సులలో సీట్లు మిగిలి ఉన్నాయని వెల్లడించారు. వివరాలకు ఫోన్ నం. 85208 66582 లలో సంప్రదించాలని సూచించారు.

పద్మశాలీల సమస్యల పరిష్కారమే లక్ష్యం

పద్మశాలి సంఘం రాష్ట్ర అధ్యక్షుడు రాజ్‌కుమార్

రవీంద్రభారతి, నవంబర్ 4 : పద్మశాలీల సమస్యల పరిష్కారంతోపాటు చేనేత, మరమగ్గాల పరిరక్షణే ధ్యేయంగా ముందుకెళ్తామని తెలంగాణ రాష్ట్ర పద్మశాలి సంఘం రాష్ట్ర అధ్యక్షుడు వల్లకటి రాజ్‌కుమార్ తెలిపారు. సోమవారం బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. రాష్ట్రంలో పద్మశాలీల అభ్యున్నతి కోసం గతంలో అనేక సంఘాలు పుట్టుకొచ్చినా.. వారికి ఏ ప్రయోజనం లేదని గుర్తించి పద్మశాలీ సంఘానికి పునాది వేశామని తెలిపారు. చేనేతల సమస్యల పరిష్కారానికి అధ్యయన కమిటీని ఏర్పాటు చేస్తామన్నారు. ఈ సందర్భంగా బ్యాలెట్ పేపర్ ద్వారా ఎన్నుకున్న నూతన కార్యవర్గాన్ని ప్రకటించారు. సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా అప్పం శ్రీనివాస్, గౌరవ అధ్యక్షుడిగా బుర్ర మల్లేశం, మేముల బాల్‌రాజ్, మీడియా ఇన్‌చార్జిగా శిలువేరు నాగరాజుతోపాటు పలువురు సభ్యులను ఎన్నుకున్నారు.

నాలాపైనే.. ఐదంతస్తులు

- నాలా స్థల ఆక్రమణపై ఐదంతస్తుల భవనం
- అంబేద్కర్‌నగర్ నాలా స్థలం గుటుకాయ: స్వాహా!
- అక్రమ ఐదంతస్తుల భవనాన్ని హైడ్రా కూల్చి వేయాలి: జనం

వెంగళరావునగర్, నవంబర్ 4: నిబంధనల్ని తుంగలో తొక్కి కనీస ప్రమాణాల్ని పాటించకుండా నాలా పక్కనే అక్రమంగా ఏకంగా ఐదంతస్తుల భవనాన్ని నిర్మించేశాడు ఓ కబ్జాదారుడు. సోమాజిగూడ డివిజన్ ఎల్లారెడ్డిగూడ అంబేద్కర్‌నగర్ నాలాకు ఆనుకుని ఉన్న స్థలాన్ని కబ్జా చేశాడు. ఈ ప్రాంతంలో హాస్టళ్లకు విపరీతమైన డిమాండ్ ఉండటంతో కనీస ప్రమాణాలు పాటించకుండా, ప్రమాదభరితం ఐనప్పటికీ సదరు వ్యక్తి ఈ భవనాన్ని నిర్మించాడు. ఓ వైపు హైడ్రా అధికారులు నాలా స్థలాలపై ఉక్కుపాదం మోపుతున్నామని, కొంతమంది ఆక్రమణదారులు అవేమీ పట్టించుకోకుండా యథేచ్ఛగా నాలాలను, ప్రభుత్వ స్థలాలను ఆక్రమించి బహుళ అంతస్తుల భవంతులను నిర్మిస్తున్నారు. కొంతకాలం నుంచి నాలాను ఆనుకొని ఇక్కడ ఇంత పెద్ద భవనాన్ని అక్రమంగా నిర్మిస్తున్నప్పటికీ, బల్దియా సిబ్బంది పట్టించుకోలేదని స్థానికులు విమర్శిస్తున్నారు. వరద నీరు పారకుండా స్తంభించేలా ఉన్న ఈ అక్రమ నిర్మాణాన్ని నిర్మిస్తున్నా అధికారులు చోద్యం మూశారే.. తప్పా.. పట్టించుకోలేదని ప్రజలు నివ్వెరపోతున్నారు. కాంగ్రెస్ ప్రభుత్వమంటే ఇదే కావొచ్చు. ఆ ప్రభుత్వం తీరు ఇట్లాగే ఉంటుంది కదా! అంటూ ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఎరక్కపోయి.. ఇరుక్కున్నామంటూ బాధితులు చెబుకుంటున్నారు. నాలాను ఆనుకొని అనుమతుల్లేకుండా నిర్మించిన ఈ అక్రమ నిర్మాణాన్ని హైడ్రా అధికారులు కూల్చివేసి, నాలాలో నీటి ప్రవాహానికి ఆటంకం లేకుండా చూడాలని అధికారులకు విజ్ఞప్తి చేస్తున్నారు.

ఎల్లారెడ్డిగూడలో నాలాను ఆనుకొని అనుమతులు లేకుండా నిర్మిస్తున్న భవనం

బీసీ సంఘం పోరాటాల ఫలితమే.. డెడికేటెడ్ కమిషన్

బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు ఆర్.కృష్ణయ్య

మాట్లాడుతున్న ఆర్.కృష్ణయ్య, చిత్రంలో గుజ్జ సత్యం, గుజ్జ కృష్ణ, తదితరులు

కాచిగూడ, నవంబర్ 4: బీసీ సంక్షేమ సంఘం తరుపున హైకోర్టులో వేసిన తీర్పు ఫలితమే తెలంగాణ ప్రభుత్వం దిగివచ్చి ప్రత్యేక డెడికేటెడ్ కమిషన్‌ను ఏర్పాటు చేసిందని మాజీ రాజ్యసభ సభ్యుడు, జాతీయ బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు ఆర్.కృష్ణయ్య అన్నారు. జాతీయ ఉపాధ్యక్షుడు గుజ్జ సత్యం ఆధ్వర్యంలో సోమవారం కాచిగూడలోని అభినందన్ హోటల్‌లో బీసీ నాయకులతో సమావేశాన్ని నిర్వహించారు. ఇందుకు ముఖ్య అతిథిగా ఆర్.కృష్ణయ్య హాజరై మాట్లాడుతూ, బీసీ కులాల ప్రజలు ధైర్యంగా బయటకు వచ్చి బీసీలుగా నమోదు చేసువాలని పిలుపునిచ్చారు. రాష్ట్ర ప్రభుత్వం స్థానిక సంస్థల్లో బీసీల రిజర్వేషన్ల కల్పన కోసం ప్రత్యేక డెడికేటెడ్ కమిషన్‌ను ఏర్పాటు చేసినందుకు సీఎం రేవంత్ రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. త్వరలో తెలంగాణలో రానున్న సర్పంచ్, ఎంపీటీసీ, జెడ్‌పీటీసీ ఎన్నికల్లో బీసీలకు రిజర్వేషన్లు లభిస్తాయని పేర్కొన్నారు. రాష్ట్రంలోని హాస్టళ్ళు, గురుకుల పాఠశాల విద్యార్థుల మెస్ చార్జీలను పెంచినందుకు హర్షం వ్యక్తం చేస్తూ, అదే విధంగా 12 బీసీ కుల ఫెడరేషన్లను బీసీ కార్పొరేషన్లుగా మార్చాలని కోరారు. తెలంగాణలోని బీసీ కాలేజ్ హాస్టళ్ళు, గురుకుల పాఠశాలలో చదివే విద్యార్థులకు సొంత భవనాలను నిర్మించాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో జాతీయ కన్వీనర్ గుజ్జ కృష్ణ, నీలం వెంకటేశ్, కోలా జనార్ధన్, నందగోపాల్, జయంతి గౌడ్, రామారావు గౌడ్, సత్యం గౌడ్, రాములు ముదిరాజ్ పాల్గొన్నారు.

నేటి మహాధర్నాకు ఆటో డ్రైవర్లంతా తరలిరావాలి

తెలంగాణ ఆటో రిక్షా డ్రైవర్స్ యూనియన్

హిమాయత్‌నగర్, నవంబర్ 4: ఆటో డ్రైవర్లకు ప్రభుత్వం ఇచ్చిన హామీలను అమలు చేయాలని డిమాండ్ చేస్తూ ఇందిరా పార్కు పరిధిలోని ధర్నా చౌక్‌లో మంగళవారం నిర్వహించ తలపెట్టిన మహా ధర్నాకు ఆటో డ్రైవర్లు అధిక సంఖ్యల్లో తరలిరావాలని తెలంగాణ ఆటో రిక్షా డ్రైవర్స్ యూనియన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఉమర్‌ఖాన్, నగర సహాయ కార్యదర్శి షేక్ లతీఫ్ సోమవారం పిలుపు నిచ్చారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఆటో డ్రైవర్లను ఆదుకుంటామని హామీ ఇచ్చి విస్మరించిందన్నారు. ఆటో డ్రైవర్లు పేదరికంలో మగ్గుతున్నారని, ఇంటి అద్దెలు, ఆటో కిరాయిలు కట్టలేక కొంత మంది ఆటో డ్రైవర్లు మానసికంగా కృంగిపోయి ఆత్మహత్యలకు పాల్పడ్డారని ఆందోళన వ్యక్తం చేశారు. మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం కల్పించడంతో ఆటో డ్రైవర్లకు గిరాకీలు లేక ఆర్థికంగా తీవ్ర ఇబ్బందులు పడుతున్నట్టు పేర్కొన్నారు. సామాజిక భద్రత కోసం సంక్షేమ బోర్డును ఏర్పాటు చేసి ఏడాదికి రూ.15 వేల ఆర్థిక సాయం అందించాలన్నారు. పెరిగిన ధరలకు అనుగుణంగా ఆటో మీటర్ చార్జీలు పెంచి, గ్రేటర్‌లో కొత్త ఆటోలకు పర్మిట్లు ఇవ్వాలని డిమాండ్ చేశారు.

నిరంతర కృషితోనే వైద్య వృత్తిలో రాణింపు

పద్మశ్రీ అవార్డు గ్రహీత డాక్టర్ హన్మంతరావు

కార్యక్రమ ప్రారంభోత్సవంలో పాల్గొన్న పద్మశ్రీ డాక్టర్ హన్మంతరావు, సీఎంఆర్ చైర్మన్ డాక్టర్ హన్మంతరావు

మేడ్చల్, నవంబరు 4: వైద్య వృత్తిలో రాణించాలంటే నిరంతర కృషి అవసరమని పద్మశ్రీ అవార్డు గ్రహీత, స్వీకార్ ఉపకార్ సంస్థ వ్యవస్థాపక, చైర్మన్ డాక్టర్ హన్మంతరావు అన్నారు. గుండ్ల పోచంపల్లి మున్సిపాలిటీ కండ్లకోయలోని సీఎంఆర్ వైద్య కళాశాలలో సోమవారం ఎంబీబీఎస్ మొదటి సంవత్సరం విద్యార్థులకు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హన్మంతరావు హాజరై మాట్లాడుతూ, వైద్య వృత్తిలో రాణించాలంటే విశ్రమించకుండా కృషి చేయాలన్నారు. పుస్తక పరిజ్ఞానంతో పాటు ప్రత్యక్ష పరిశీలనతో పరిజ్ఞానాన్ని పెంపొందించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో సీఎంఆర్ చైర్మన్ గోపాల్ రెడ్డి, ఎస్ఆర్ యూనివర్సిటీ చాన్సలర్ మధుకర్‌రెడ్డి, సీఎంఆర్ వైస్ చైర్మన్ అభినవ్‌రెడ్డి, కార్యదర్శి వసంతలత, నిర్వాహక కమిటీ సభ్యులు ఐశ్వర్య, అనురాగ్ రెడ్డి, డీన్ డాక్టర్ వెంకట రమణయ్య, డైరెక్టర్ ఆలీబేగ్, ఏవో సురేశ్, మేనేజర్ దుర్గా ప్రసాద్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

బాలుర చిల్డ్రన్స్ హోంలో డీ-అడిక్షన్ సెంటర్

హైదరాబాద్ కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి

సైదాబాద్ ప్రభుత్వం బాలుర సదనంలో అధికారుల నుంచి వివరాలు తెలుసుకుంటున్న జిల్లా కలెక్టర్ అనుదీప్

సిటీబ్యూరో, నవంబర్ 4(నమస్తే తెలంగాణ)/ సైదాబాద్: సైదాబాద్‌లోని ప్రభుత్వ చిల్డ్రన్స్ హోంలో డీ అడిక్షన్ సెంటర్‌ను ప్రారంభిస్తామని హైదరాబాద్ కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి అన్నారు. ఆయన బాలుర చిల్డ్రన్స్ హోమ్‌ను సోమవారం పరిశీలించారు. డ్రగ్స్ మహమ్మారితో కలిగే నష్టాలపై ప్రజలలో అవగాహన కల్పిస్తూ నివారణకు జిల్లాలో పటిష్ట చర్యలు చేపడుతున్నట్టు పేర్కొన్నారు. అనాథ పిల్లల బాధ్యత మన అందరి బాధ్యతను వివరించారు. వారి ఆరోగ్యంపై శ్రద్ధ వహించాలని, నాణ్యమైన చికిత్స అందించాలని సూచించారు. అనంతరం, ఆర్చరీ క్రీడా మైదానాన్ని పరిశీలించి ఆర్చరీలో రాష్ట్ర స్థాయికి ఎదిగిన పిల్లలతో ముచ్చటించారు. దేశ, అంతర్జాతీయ స్థాయిలో ఎదగాలని వారికి సూచించారు. అవసరమయ్యే క్రీడా సామగ్రి ప్రతిపాదనలను పంపాలని సూచించారు. ప్రభుత్వ చిల్డ్రన్ హోంలోని వంటశాలను, డార్మెట్ హాల్‌ను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో డీడీ మీర్జా రాజ అలీబేగ్, ఏడీ అబ్బుదల్, ఐసీడీఎస్ ఏడీ రాజేందర్, ఆర్డీఓ రామకృష్ణ, తహసీల్దార్ జయశ్రీ పాల్గొన్నారు.

100% కచ్చితత్వంతో సమగ్ర సర్వే చేపట్టాలి

అంబర్‌పేట డిప్యూటీ కమిషనర్ మారుతి దివాకర్

సిటీబ్యూరో, నవంబరు 4(నమస్తే తెలంగాణ): వంద శాతం కచ్చితత్వంతో సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వే సమర్థవంతంగా చేపట్టాలని అంబర్‌పేట డిప్యూటీ కమిషనర్ మారుతి దివాకర్ సూచించారు. అంబర్‌పేట సర్కిల్‌లో ఈ నెల 6వ తేదీ నుంచి చేపట్టనున్న సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వేపై సూపర్ వైజర్లు, ఎన్యూమరేటర్లకు అంబర్‌పేటలోని మహా రాణా ప్రతాప్ ఫంక్షన్ హాల్‌లో సోమవారం శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. నవంబర్ 6 నుంచి ప్రారంభమయ్యే (సామాజిక, ఆర్థిక, విద్య, ఉపాధి, రాజకీయ, కుల సర్వే) సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వేలో ప్రజల సామాజిక, ఆర్థిక పరిస్థితులను ఎలాంటి పొరపాట్లకు తావివ్వకుండా నమోదు చేయాలని మారుతి దివాకర్ సూచించారు. అంబర్‌పేటలో 90 వేల ఇండ్ల సర్వేను పకడ్బందీగా చేపట్టేందుకు ఎన్యూమరేటర్లను, సూపర్ వైజర్లను నియమించామని తెలిపారు. ప్రతి ఎన్యూమరేటర్ 150 ఇండ్ల సర్వే చేయాల్సి ఉంటుందన్నారు. ఏదేని సందేహాలు ఉన్నట్లైతే ఎప్పటికప్పుడు సంబంధిత సూపర్ వైజర్లను సంప్రదించి నివృత్తి చేసుకోవాలన్నారు. ఎన్యూమరేటర్లు మార్గదర్శకాల మేరకు సర్వే నిర్వహించాలని తెలిపారు. సర్వే చేసిన ప్రతి ఇంటికి స్టిక్కర్‌ను అతికించాలని సూచించారు. సూపర్ వైజర్లు ఎన్యూమరేటర్ల పనితీరును పర్యవేక్షించడంతో పాటు సర్వే ప్రక్రియలో అవసరమైన సహాయం అందించాలన్నారు. కార్యక్రమంలో మాస్టర్ ట్రైనర్లు శంకర్, రామ్మోహన్, రజిత, ఎన్యూమరేటర్లు, సూపర్ వైజర్లు, స్వయం సహాయక సంఘాల మహిళలు, అంబర్‌పేట సర్కిల్ కార్యాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

అంబేద్కర్ ఓపెన్ యూనివర్సిటీలో అందోళనలో చేస్తున్న ఉద్యోగులు

ప్రభుత్వ నిర్ణయంతో ఓపెన్ వర్సిటీ పురోగతికి ఆటంకం

యూనివర్సిటీ ఉద్యోగ సంఘాల జేఏసీ

బంజారాహిల్స్, నవంబర్ 4: దేశంలోనే మూడో మెగా యూనివర్సిటీగా పేరు సంపాదించుకుని, దూర విద్యా విధానంలో లక్షలాది మందికి నాణ్యమైన ఉన్నత విద్యను అందిస్తున్న డాక్టర్ బీఆర్ అంబేద్కర్ ఓపెన్ యూనివర్సిటీ పురోగతికి ప్రభుత్వ నిర్ణయం ఆటంకంగా మారిందని యూనివర్సిటీ ఉద్యోగులు అన్నారు. వర్సిటీ ఉన్నతిని దెబ్బతీసే విధంగా, జూబ్లీహిల్స్‌లోని ఓపెన్ యూనివర్సిటీకి చెందిన 10 ఎకరాల స్థలాన్ని జేఎన్ఎఫ్ఏయూకు కేటాయించాలన్న నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవాలని యూనివర్సిటీ ఉద్యోగ సంఘాల జేఏసీ చైర్‌పర్సన్ ప్రొ.పల్లవీ కాబ్డే, కన్వీనర్ ప్రొ. వడ్డాణం శ్రీనివాస్ డిమాండ్ చేశారు. జేఏసీ ఆధ్వర్యంలో చేపట్టిన ఆందోళనలో భాగంగా సోమవారం మధ్యాహ్న భోజన విరామ సమయంలో నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా ప్రభుత్వ నిర్ణయానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ప్రొ.పల్లవీ కాబ్డే మాట్లాడుతూ, డిగ్రీ నుంచి పరిశోధనా కోర్సుల వరకు వివిధ కోర్సుల్లో వేలాది మందికి విద్యను అందిస్తున్నామని, నూతన విద్యా విధానం ప్రకారం, మరిన్ని కొత్త కోర్సులను అందుబాటులోకి తీసుకువచ్చేందుకు ప్రయత్నిస్తున్నామని పేర్కొన్నారు. దేశంలో స్థూల నమోదు నిష్పత్తిని పెంచడంలో డా. అం